BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్
Follow: @ANNTELUGU
మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ 08-01-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
ANN తెలుగు

# కందికి ఎమ్మెల్సీ
# వెడ్మ బొజ్జుకు డీసీసీ?

## ఆదిలాబాద్ పాలిటిక్స్‌లో కొత్త ట్విస్ట్

### పీసీసీ చీఫ్ మహేష్ పర్యటనలో గుట్టు
### ఆదిలాబాద్‌పై హైకమాండ్ ప్లాన్
### ఆదిలాబాద్.. హైదరాబాద్‌పై స్పెషల్ ఫోకస్




**హైదరాబాద్, మహా:** కాంగ్రెస్ హైకమాండ్ ఆపరేషన్ ఆదిలాబాద్ పై ఫోకస్ పెట్టిందా? తాజాగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ ఛార్జి దీపాదాస్ మున్షీ, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆదిలాబాద్ పర్యటన వెనుక మతలబు ఏంటి? ఆదిలాబాద్ లో ఏం జరగబోతోంది? దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రిపోర్ట్ తెప్పించుకున్న కాంగ్రెస్ హైకమాండ్ ప్రస్తుతం పార్టీపరంగా బలపడాల్సిన అవసరమున్న ప్రాంతాలను గుర్తించింది. ఇదే క్రమంలో ఎవరికి అవకాశమిస్తే.. పార్టీకి మేలు జరిగి భవిష్యత్ ఎన్నికలకు ఉపకరిస్తుందన్న అంశాలపై స్పష్టమైన అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. వచ్చే నెలలో షెడ్యూల్ విడుదల కానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కంది శ్రీనివాసరెడ్డి పేరును హైకమాండ్ పరిశీలిస్తోంది. ఇటీవల అసెంబ్లీకి వచ్చి ముఖ్యమంత్రిని కలవడం వెనుక దీనికి సంబంధించి అభిప్రాయం తీసుకున్నారనే ప్రచారముంది. మరోవైపు పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇంత బిజీలోనూ ఆదిలాబాద్ పట్టణంలో మకాం వేయడం వెనుక కందికి ఎమ్మెల్సీపై కీలక నేతల అభిప్రాయాలు తీసుకున్నట్లు తెలిసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ సూచనమేరకు వెనుకపడ్డ, బలోపేతానికి అవకాశమున్న ప్రాంతాలపై ఫోకస్ పెట్టినట్లు తెలిసింది. కందికి ఎమ్మెల్సీ ఇచ్చి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు జిల్లా కాంగ్రెస్ పగ్గాలు ఇచ్చే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఇద్దరు కీలకనేతలు ఆదిలాబాద్ లో మకాం వేసి కంది సేవలు, సామర్థ్యంపై అంచనాకొచ్చారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ముఖ్యనేతలకు పదవులపై హైకమాండ్ మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో హైదరాబాద్ కు సంబంధించిన ప్రణాళికపైనా కేసీ వేణుగోపాల్ ఆదేశాలతో వర్కవుట్ జరుగుతోంది. ప్రభుత్వ ఇంటెలిజెన్స్, సునిల్ కనుగోలు టీం సర్వేలు, హైకమాండ్ సర్వేలతో.. ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని బలోపేతం చేయడానికి కందికి ఎమ్మెల్సీ ఇవ్వాలని, మరోవైపు ఆదివాసీ జిల్లాలో పట్టుకోసం వెడ్మబొజ్జును ప్రోత్సహించాలని హైకమాండ్ నిర్ణయానికొచ్చినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పార్టీ పగ్గాలు అప్పగించాలన్న వ్యూహంతో హైకమాండ్ ఉంది.

### పథకాల ప్రచారం కీలకం

ప్రభుత్వ పథకాలను కిందివరకు తీసుకెళ్ళేలా, రానున్న ఎన్నికలలో ఫలితాలు తీసుకొచ్చేలా హైకమాండ్ పకడ్బందీ వ్యూహాన్ని రచిస్తోంది. ఈ క్రమంలోనే యువనేతలకు కీలక బాధ్యతలు అప్పగించడం ద్వారా దీర్ఘకాలం పార్టీని కాపాడుకోవొచ్చని, విస్తరించుకోవొచ్చన్న భావనలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్ సభకు 30వేల ఓట్లు అధికంగా సాధించడం, తాజా సర్వేలలో జిల్లాలో టాప్ లో ఉండడం కూడా అధిష్టానం పరిశీలనకు కారణమని భావిస్తున్నారు. ఇప్పటికే ఓ ఎమ్మెల్సీని పార్టీ అధిష్టానం అద్దంకి దయాకర్ కు ఖరారుచేసింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా జీవన్ రెడ్డిని ఎంపికచేసింది. మైనారిటీల కోటాలో షబ్బీర్ అలీ పేరును పరిశీలిస్తోంది. మొత్తంగా రానున్న రోజుల్లో పార్టీలో జోష్ తెచ్చే ప్రణాళికలు అధిష్టానం రూపొందిస్తోంది. హైదరాబాద్ లో కేసీ వేణుగోపాల్ నిర్వహించిన పిఏసి సమావేశం కూడా అత్యంత కీలకంగా మారింది. తాజా పరిస్థితులపై ఆయన నివేదికలు తీసుకున్నట్లు తెలుస్తోంది.






---

**సోషల్ వైరల్**

## బీజేపీ సెటైరికల్ పోస్టర్

కేసీఆర్ కనబడటం లేదంటూ.. బీజేపీ బుధవారం సెటైరికల్ పోస్టర్‌ను విడుదల చేసింది. పత్తా లేని పెద్దమనిషి అధికార భోగానికే గానీ, ప్రజల బాదరబందీలపై దొరకు పట్టింపు లేదంటూ.. విమర్శించింది. - మహా, హైదరాబాద్ బ్యూరో






## రేవంత్ రెడ్డి.. రివేంజ్ రెడ్డి

### బీఆర్ఎస్ పార్టీ డైరీ ఆవిష్కరణలో కేటీఆర్

**మహా, హైదరాబాద్:** రేవంత్ రెడ్డి.. రివేంజ్ రెడ్డి అని ప్రజలు అనుకుంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ నూతన సంవత్సర 2025 డైరీని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలసి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఇప్పుడున్న కేసు లొట్టపీసు కేసని, రేవంత్ లొట్టపీసు ముఖ్యమంత్రి అని విమర్శించారు. తనపై పెట్టిన కేసుల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, ప్రజా సమస్యలపై కార్యకర్తలు కొట్లాడాలన్నారు.

## మేఘా మార్కు చూపిస్తా

### వనపర్తిని మోడల్ గా మారుస్తా.. జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి:** నియోజకవర్గ అభివృద్ధిలో మేఘా మార్కు చూపిస్తానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. తన జన్మదినం సందర్భంగా మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వనపర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తానంటూ హామీ ఇచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నదంటూ ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ. 600 కోట్లకు పైగా అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. ప్రభుత్వ ఆఫీసులకు సొంత భవనాలను నిర్మిస్తామన్నారు. రానున్న స్థానిక



సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

## రేపు సాయంత్రం కేటీఆర్ అరెస్ట్...?

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుంది. దర్యాప్తు సంస్థలు ఏసీబీ, ఈడీ ఇప్పటికే విచారణలు ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారికి విచారణకు హాజరు కావాలంటూ నోటీసులు ఇచ్చాయి. ఈ క్రమంలో ఈడీ విచారణకు హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి నేడు హాజరయ్యారు. ఇటు ఏసీబీ విచారణకు అరవింద్ కుమార్ హాజరయ్యారు. ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారనే అభియోగం క్రింద కేటీఆర్‌పై 4 సెక్షన్ల తో కేసు నమోదు చేసిన ఏసీబీ విచారణకు రేపు ఆయన హాజరుకానున్నారు. ఈ ముగ్గురిపై ఏసీబీ కేసులు నమోదు చేసింది. ఆర్బీఐ గైడ్‌లైన్స్‌కు విరుద్ధంగా ఎఫ్ఈవో కంపెనీకి రూ. 46 కోట్లను హెచ్ఎండీఏ ద్వారా చెల్లించారు. కేబినెట్ అనుమతి, ఫైనాన్స్ క్లియరెన్స్ లేకుండానే నిధులు చెల్లించినట్టు కేటీఆర్‌పై అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసులో ఏ1గా కేటీఆర్, ఏ2గా అరవింద్‌కుమార్, ఏ3గా బీఎల్ఎన్ రెడ్డి ఉన్నారు. ఇదిలా ఉంటే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ దాఖలు చేయగా, ఆ పిటిషన్ ను న్యాయస్థానం కొట్టివేసింది. ఆ తరువాత హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ కేటీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సర్కారు కూడా అప్రమత్తమై తమ వాదనను కూడా వినాలంటూ ముందుగానే కెవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఇదిలా ఉంటే.. ఇక తప్పని పరిస్థితుల్లో ఏసీబీ విచారణకు హాజరయ్యేందుకు సిద్ధమైన కేటీఆర్.. ఏసీబీ విచారణలో తమ లాయర్ ను కూడా అనుమతించాలంటూ నేడు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ ను దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను విచారించిన న్యాయస్థానం షాకిచ్చింది. దీంతో రేపు ఏసీబీ విచారణకు ఆయన హాజరుకానున్నారు. విచారణ అనంతరం కేటీఆర్ ను అరెస్ట్ చేసే అవకాశాలున్నాయన్న చర్చ జరుగుతోంది.